www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 2 మార్చి 2025
5
అన్నమయ్య

కేన్సర్ బాధితులకు విగ్గులు పంపిణీ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

కేన్సర్ బాధితులకు విగ్గులను పంపిణీ చేస్తున్నట్లు హెల్పింగ్ మైండ్స్ వ్యవస్థాపకులు అబూబకర్ సిద్దిక్ వెల్లడించారు. హెల్పింగ్ మైండ్స్ హెయిర్ డోనేషన్ కార్యక్రమంలో భాగంగా ములకలచెరువుకు చెందిన భవాని కేన్సర్ బాధితుల కోసం శనివారం హెల్పింగ్ మైండ్స్ కార్యాలయంలో కేశాలు దానం చేశారు. ఈ సందర్భంగా అబూబక్కర్ సిద్దిక్ మాట్లాడుతూ తమ సంస్థ సేవలను విస్తృతం చేస్తూ కేన్సర్ బాధితులకు ఉచితంగా విగ్గులు పంపిణీ చేసి, వారి వివరాలు గోప్యంగా ఉంచుతున్నట్లు తెలిపారు. ఇప్పటికి 68 మంది కేశాలు దానం చేశారని, కేశాలు దానం చేస్తున్న మహిళలు, చిన్నారులు పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా కేన్సర్ బాధితులకు ఎవరికైనా విగ్గులు కావాలంటే తమ సంస్థ ఉచితంగా పంపిణీ చేస్తుందని పేర్కొన్నారు. కేశాలు దానం చేసిన భవానికి ప్రశంసా పత్రంతో పాటు పూలమొక్క బహుకరించిన హెల్పింగ్ మైండ్స్ బృందం అభినందించింది. కార్యక్రమంలో సంస్థ సభ్యులు కిరణ్, హర్ష, స్టూడియో లెవెన్ ఖాజా పాల్గొన్నారు.

ఏప్రిల్ 6 నుంచి ఒంటిమిట్ట
కోదండరాముడి బ్రహ్మోత్సవాలు

- 11న సీతారాముల కల్యాణం
- ఏర్పాట్లు పరిశీలించిన టిటిడి ఇఒ, కడప కలెక్టర్
- ఉత్సవాలపై అధికారులకు దిశానిర్దేశం

బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై అధికారులకు దిశానిర్దేశం చేస్తున్న కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

ప్రజాశక్తి-ఒంటిమిట్ట

ఏప్రిల్ 6 నుండి15 వరకు ప్రతిష్టాత్మకంగా ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారని, అదే నెల 11న నిర్వహించబోయే శ్రీ సీతారాముల కల్యాణానికి ఎలాంటి లోటు పాట్లు లేకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి సంబంధితాధికారులను ఆదేశించారు. శనివారం స్థానిక టిటిడి కల్యాణ మండపం సమీపంలోని పరిపాలన భవనం సమావేశపు హాలులో టిటిడి ఇఒ జె. శ్యామలరావు, జెఇఒ వీరబ్రహ్మం, డిఐజి, విశ్వేశ్వర నాయుడుతో కలిసి కలిసి ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామివారి బ్రహ్మోత్సవాలు, కల్యాణోత్సవ ఏర్పాట్లపై జిల్లా, టిటిడి అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారని చెప్పారు. అందులో భాగంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు, అసౌకర్యం లేకుండా జిల్లా, టిటిడి అధికారులు సంయుక్తంగా, సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలన్నారు. ముఖ్యంగా కల్యాణోత్సవానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వచ్చే అవకాశమున్నందున అన్ని రకాల ఏర్పాట్లు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు. ఆ మేరకు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా టిటిడి, పోలీస్ అధికారులు సంయుక్తంగా, నిర్దిష్ట ప్రణాళికలతో విధులను నిర్వర్తించాలన్నారు. రామాలయంలో కళ్యాణోత్సవాన్ని తిలకించేందుకు కళ్యాణవేదిక ముందు ఏర్పాటు చేసిన ఒక్కో గ్యాలరీకి ఒకరిని ఇన్ఛార్జిగా నియమిస్తామన్నారు. ఎక్కడా కూడా జనం తొక్కిసలాట జరుగకుండా అధికారులు, పోలీస్ తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విద్యుత్తు సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఉమ్మడి కడప జిల్లాల నుంచి బస్సుల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. కడప, రాజంపేట, రాయచోటి వైపు నుంచే ఆర్‌టిసి బస్సులకు పార్కింగ్, అలాగే ఇతర జిల్లాల నుంచి ఎన్ని బస్సులు వస్తున్నాయో తెలుసుకుని పక్కాగా ప్లాన్ రూపొందించుకుని ఏర్పాట్లు చేసుకోవాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. ఉచిత బస్సుల సౌకర్యంపై ఎప్పటికప్పుడు సమాచారం తెలియచేయాలన్నారు. ఉత్సవాలకు హాజరయ్యే భక్తులకు కావాల్సిన అన్ని రకాల మౌలిక, కనీస వసతులను ఎలాంటి లోటుపాట్లు లేకుండా పూర్తి చేయాలని పేర్కొన్నారు. టిటిడి ఇఒ మాటాడుతూ ఈనెల చివరి నాటికి ఒంటిమిట్ట రామాలయంలో అభివృద్ధి పనులను పూర్తి చేయాలని, కల్యాణ వేదికను ఆకట్టుకునేలా తీర్చిదిద్దాలని అధికారులను కోరారు. కడప జిల్లా అధికారులతో సమన్వయం చేసుకుని భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ముందస్తు ఏర్పాట్లను ప్రణాళిక బద్ధంగా చేపట్టాలన్నారు. ప్రతి 15 రోజులకోసారి పనుల ప్రగతిని సమీక్షిస్తానని చెప్పారు. ఇఒ మాట్లాడుతూ శ్రీ సీతారాముల కల్యాణానికి విస్తృతంగా ఏర్పాట్లు చేపట్టాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ వేడుకగా నిర్వహించే కల్యాణానికి లక్ష మందికి పైగా భక్తులు వచ్చే అవకాశం ఉన్న నేపథ్య ంలో టిటిడి అధికారులు, కడప జిల్లా అధికారులు సమన్వయంతో పనిచే యాలని సూచించారు. కడప జిల్లా ఎస్‌పి అశోక్ కుమార్ మాట్లాడుతూ పటిష్ట బారికేడింగ్‌ను ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రతి గ్యాలరీ వద్ద గట్టి భద్రతా చర్యలు చేపడతామన్నారు. ఎక్కడా, ఎలాంటి చిన్న పొరపాటుకు కూడా అవకాశం లేకుండా ఈ ఏడాది కూడా బ్రహ్మోత్సవాలను విజ యవంతం చేసేందుకు కృషిచేస్తామన్నారు. కార్యక్ర మంలో కడప ఆర్‌డిఒ జాన్ ఇర్విన్, మున్సిపల్ కమిషనర్ మనోజ్ రెడ్డి, డిఆర్‌డిఎ , మెప్మా పీడిలు ఆనంద్ నాయక్, కిరణ్ కుమార్, జిల్లా అగ్నిమాపక అధికారి ధర్మా రావు, టూరిజం అధికారి సురేష్ , డిఎంహెచ్‌ఒ డా.నాగరాజు, డిపిఒ రాజ్యలక్ష్మి, ఆర్‌టిసి ఆర్‌ఎం ప్రసాద్ రెడ్డి, టిటిడి పిఆర్‌ఒ రవి, సమాచార శాఖ ఏడీ వేణుగోపాల్ రెడ్డి, టిటిడి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఏర్పాట్లును పరిశీలించిన ఇఒ,జెఇఒ

ఒంటిమిట్ట బ్రహ్మోత్సవాల సందర్భంగా కలెక్టర్ శ్రీధర్, చెరుకూరి, ఎస్‌పి అశోక్‌కుమర్‌తో కలిసి టిటిడి ఇఒ జె శ్యామలరావు, జెఇఒ వీరబ్రహ్మం ఆలయ పరిసరాలు, కల్యాణ వేదిక ప్రాంతాలను శనివారం పరిశీలించారు. భక్తుల రద్దీ నేపథ్యంలో ఒంటిమిట్ట ఆలయం పరిసరాలు, కల్యాణ వేదిక సమీపంలో ట్రాఫిక్ , భద్రతా, క్యూలైన్లు, అన్నప్రసాదాలు, తాగునీరు, మజ్జిగ, స్వామివారి తలంబ్రాలు పంపిణీపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.

మార్చి 5 నుంచి 9 వరకు మహా సంప్రోక్షణ మహోత్సవం

ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామివారి ఆలయంలో మార్చి 5 నుండి 9వ తేదీ వరకు మహా సంప్రోక్షణ మహోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించనున్నట్లు టిటిడి ఇఒ జె. శ్యామల రావు తెలిపారు. గర్భాలయంలో జీర్ణోద్ధరణ కోసం గత ఏడాది సెప్టెంబరు 6 నుండి 8 వరకు 'బాలాలయం' నిర్వహించామన్నారు. ప్రస్తుతం పనులు పూర్తి కావచ్చాయని పేర్కొన్నారు. మహాసంప్రోక్షణ కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహిస్తామన్నారు.

ఆలయంలో ఏర్పాట్ల పనులను పరిశీలిస్తున్న టిటిడి ఇఒ, జెఇఒ

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు ప్రారంభం

- మొదటి రోజు 865 మంది విద్యార్థులు గైర్హాజర్

రాయచోటి : పరీక్ష కేంద్రం వద్ద గుమి కూడిన విద్యార్థులు

పీలేరు : పరీక్ష రాస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి - రాయచోటి

జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షలు మొదటి రోజు శనివారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష సమయం కాగా విద్యార్థులు ఉదయం 8:30 గంటలకే తమకు కేటాయించిన పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని ఆదేశాలు ఉండడంతో విద్యార్థులు ఉదయం 8 గంటల నుంచే పరీక్షా కేంద్రాల వద్దకు చెరుకుని గేట్ల ముందు గుమిగూడారు. మొదటి రోజు మొదటి సంవత్సరం విద్యార్థులకు తెలుగు, హిందీ, ఉర్దూ, సంస్కృతం ఐచ్ఛిక భాషల్లో పరీక్షకు హాజరయ్యారు. జిల్లా వ్యాప్తంగా 15,539 మంది విద్యార్థులు పరీక్షకు హాజరవ్వాల్సి ఉండగా14,674 మంది హాజరు కాగా 865 మంది గైహాజరయ్యారు. జనరల్ 14,335 మంది ఉండగా 13,630 హాజరు కాగా 705 మంది గైహాజరయ్యారు. ఒకేషనల్‌లో 1204 మంది విద్యార్థులు ఉండగా 1044 మంది విద్యార్థుల హాజరు కాగా 160 మంది విద్యార్థులు గైహాజరయ్యారు. రాయచోటి పట్టణంలో ఏడు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. 2,357 మంది విద్యార్థులు ఉండగా 2212 మంది హాజరుకాగా 145 మంది గైహాజరయ్యారు. జిల్లా వ్యాప్తంగా అన్ని పరీక్ష కేంద్రాల వద్ద ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటన చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

పోసానికి తీవ్ర అస్వస్థత

రాజంపేట, కడప ఆస్పత్రుల్లో వైద్య పరీక్షలు

పోసానిని వైద్య పరీక్షలకు తరలిస్తున్న పోలీసులు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

సినీ నటుడు పోసాని కృష్ణమురళి శనివారం తీవ్ర అస్వస్థత గురి వావడంతో పోలీసులు ఆయనను రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించారు. గతంలో ఆయనకు గుండె సంబంధిత సమస్యలు కారణంగా స్టంట్ వేశారు. మరలా అదే సమస్యతో ఇబ్బంది పడుతున్నట్లుగా పోసాని పోలీసులకు తెలిపినట్లు సమాచారం. రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రి పిసి యూనిట్ వైద్యాధికారి వికాస్ పోసానికి వైద్య పరీక్షలు నిర్వహించి 2డి ఎకో పరీక్షల నిమిత్తం కడప రిమ్స్ ఆసుపత్రికి రైల్వేకోడూరు సిఐ వెంకటేశ్వర్లు, రాజంపేట ఎస్ఐ లక్ష్మీప్రసాద్‌రెడ్డి తరలించారు. వైద్య పరీక్షల అనంతరం పోసానిని కడప సబ్ జైలులో రిమాండ్‌కు ఉంచే అవకాశం ఉన్నట్లు సమాచారం.

పోసాని డ్రామాలు ఆడుతున్నారు : పోసాని అస్వస్థత పేరుతో డ్రామాలు ఆడుతున్నారని రైల్వేకోడూరు సిఐ వెంకటేశ్వర్లు మీడియాకు వెల్లడించారు. సబ్ జైల్లో చాతినొప్పి అంటూ తెలిపారని వెంటనే రాజంపేట ప్రభుత్వ ఆస్పత్రిలో చూపించామని తెలిపారు. వైద్యులు పరీక్షలు చేశారని చెప్పారు. రాజంపేట నుంచి కడప రిమ్స్‌కు తరలించి మరోసారి మైరుగైన చికిత్స అందించామన్నారు. పోసానికి ఎలాంటి ఆరోగ్య సమస్యలు లేవని తెలిపారు. పోసాని డ్రామా ఆడుతున్నాడరని చెప్పారు. ఇసిజి, రక్త పరీక్షలు నిర్వహించామన్నారు. రిమ్స్‌లో వైద్య పరీక్షలు అనంతరం మళ్ళీ రాజంపేట సబ్ జైలుకు తరలిస్తామని పేర్కొన్నారు.

వైసిపిలో బయటపడ్డ విభేదాలు

పోసాని మూలాఖత్ సాక్షిగా వైసిపిలో అంతర్గత విభేదాలు బయటపడ్డాయి. శనివారం రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ్‌రెడ్డి మూలాఖత్‌లో పోసానిని కలిసేందుకు వెళ్లగా.. రైల్వేకోడూరు మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు కూడా పోసానిని కలిసేందుకు వస్తున్నారని, ఇద్దరూ ఒకేసారి ములాఖత్‌లో పోసానిని కలవాల్సిందిగా జైలు అధికారులు సూచించారు. కొరముట్లతో తనకు పనిలేదంటూ ఆకేపాటి మాత్రమే పోసానిని కలిసి పరామర్శించారు. ఆయన తిరిగి వెళ్లిన తర్వాత జైలు వద్దకు చేరుకున్న కొరముట్ల శ్రీనివాసులను శనివారం ములాఖత్ కోటా ముగిసిందని, ఆకేపాటికి సర్ది చెప్పినా వినలేదని జైలు సూపరింటెండెంట్ మల్‌రెడ్డి తెలపడంతో కొరముట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. అమర్నాథ్‌రెడ్డికి బుర్ర లేదంటూ జైలు సూపరిండెంట్ మల్‌రెడ్డితో వాగ్వాదానికి దిగారు. జైలు అధికారులు సర్ది చెప్పడంతో ఆయన అక్కడినుండి వెనుదిరిగారు.

రూ.100 కోట్ల డిపాజిట్ల సేకరణే లక్ష్యం

- టౌన్ బ్యాంకు చైర్మన్ నాదెళ్ల విద్యాసాగర్

మాట్లాడుతున్న టౌన్ బ్యాంకు చైర్మన్ విద్యాసాగర్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

జాతీయ బ్యాంకులకు ధీటుగా ది మదనపల్లి కో-పరేటివ్ టౌన్ బ్యాంకులో రుణాలు మంజూరు చేయడం జరుగుతోందని టౌన్ బ్యాంకు చైర్మన్ నాదెళ్ల విద్యాసాగర్ అన్నారు. శనివారం స్థానిక టౌన్ బ్యాంకులో వైస్ చైర్మన్లు, డైరెక్టర్లతో కలసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం టౌన్ బ్యాంకు రూ. 160 కోట్లు లావాదేవీలు నడుస్తు న్నాయన్నారు. పుర ప్రజలు బ్యాంకు రుణాలను సద్వినియోగం చేసుకొవాలని పిలుపునిచ్చారు. ఈ ఏడాదికి ది మదనపల్లి కో-ఆపరేటివ్ టౌన్ బ్యాంకు ఆవిర్భవించి వందేళ్ల పూర్తి చేసుకొన్న సందర్భంగా ఏప్రిల్ లేదా మే నెలలో శత సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహిస్తామన్నారు. రూ.100 కోట్ల డిపాజిట్ల సేకరణ లక్ష్యాన్ని పూర్తి చేస్తామన్నారు. ఆ దిశగా పట్టణ ప్రజలు బ్యాంకులో డిపాజిట్లు చేయాలని కోరారు. మార్ట్ గేజ్ రుణాలు, ఇంటి నిర్మాణ రుణాలు, ఓవర్ డ్రాఫ్ట్ రుణాలు, ఫిక్స్ డిపాజిట్ రుణాలు, సేవింగ్స్ డిపాజిట్, రికరింగ్ డిపాజిట్, కరెంట్ డిపాజిట్ రుణాలు బ్యాంకులో రూ.90.54 కోట్లు ఉన్నాయిని తెలిపారు. బంగారు ఆభరణాల రుణాలు రూ.17.45 కోట్లు కొనసాగుతు న్నాయన్నారు. బ్యాంకు వైస్ చైర్మన్, డైరెక్టర్లు సిబ్బంది సహకారంతో పురోభి వృద్ధిలో కొనసాగుతోందని అందుకు సహకరించిన ఖాతాదారులు,సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో ఇలాగే సహాయ, సహకారాలు కొనసాగాలని కోరారు. కార్యక్రమంలో సిఇఒ పి.వి.ప్రసాద్, వైస్ చైర్మన్ భాస్కర్ మహర్షి, డైరెక్టర్లు శ్రీరామ రవికాంత్, ముక్తియార్ అలీఖాన్, సోమశేఖర్, నాదెళ్ల వెంక టేశ్వర ప్రసాద్, ఆర్.భాస్కర్, డి.నిరంజన్, అలీఖాన్, మేనేజర్ రవిచంద్రారెడ్డి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కన్వీనర్ శ్రీనివాసులు

ప్రభుత్వాస్పత్రి రక్షణ కోసం చర్యలు శూన్యం

- సిపిఎం జిల్లా కన్వీనర్ పి.శ్రీనివాసులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : ధర్మాసుపత్రిని ప్రయివేట్ పరం కాకుండా ఎమ్మెల్యే షాజహాన్ బాషా ఇచ్చిన హామీ ఏమైందని, ఆసుపత్రి పరిరక్షణ కోసం తీసుకున్న చర్యలు శూన్యమని సిపిఎం జిల్లా కన్వీనర్ పి.శ్రీనివాసులు అన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వాస్పత్రి వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మెడికల్ కాలేజీని ప్రయివేట్ భాగస్వామ్యంతో నిర్వహించాలనే కూటమి ప్రభుత్వ చర్యలు అర్ధరహితమన్నారు. పేద వాడికి వైద్యసేవలు దూరం చేయాలని, వైద్యాన్ని కూడా వ్యాపారంగా మార్చడం కోసమే 4పి మోడల్ ప్రతిపాదిస్తున్నారని అన్నారు. మదనపల్లి ధర్మాసుపత్రి ప్రయివేట్ పరం కాకుండా కాపాడటం కోసం సిపిఎం సామూహిక దీక్షలు చేసిందని అన్ని ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలు మద్దతు ఇచ్చాయని గుర్తు చేశారు. ప్రభుత్వ ఆసుపత్రి ప్రయివేటు పరం కావడం పట్ల ప్రజల్లో వచ్చిన ఆందోళన నేపథ్యంలో ఎమ్మెల్యే సిపిఎం దీక్ష శిబిరానికి వచ్చి నెల రోజుల్లో ఖాళీగా ఉన్న డాక్టర్ పోస్టులు అన్నింటిని భర్తీ చేస్తామని, స్టాఫ్ నర్సులు బదిలీ కాకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. 72 మంది డాక్టర్లు ఉండాల్సిన ఆస్పత్రిలో కేవలం 17 మంది మాత్రమే ఉన్నారని, అధిక సంఖ్యలో నర్సింగ్ స్టాఫ్‌ను బదిలీ చేసారన్నారు. రోజురోజుకి అవుట్ పెషేంట్స్ తగ్గిపోతున్నారని, ప్రతి చిన్న కేసును రెఫర్ చేయడమే ఇందుకు కారణమన్నారు. ఇఎన్ టి వైద్యులే లేరని, ఆర్థో ఆపరేషన్లు జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఖాళీ పోస్టులు భర్తీ చెయ్యాలని, ప్రభుత్వ ఆసుపత్రి ప్రయివేటు పరం కాకుండా చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు హరిశర్మ, నాగరాజు, నరసింహ, జయబాబు పాల్గొన్నారు.

నిరాశపర్చిన బడ్జెట్ : సిపిఎం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్: రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశపెట్టిన బడ్జెట్ అన్ని వర్గాల వారికి నిరాశ జనకమని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు రవికుమార్, పండు గోళ్ళ మణి తెలిపారు. శనివారం వారు రాజంపేట పట్టణంలో విలేకరులతో మాట్లా డుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ప్రాజెక్టులకు నిధులు కేటాయిం చకపో వడం, వ్యవసాయ కూలీలకు ఉపాధీ కల్పించకపోవడం బాధాకరమని అన్నారు. తాము అధికారంలోకి వస్తే అన్నమయ్య, పించా డ్యాములు పటిష్టంగా పునర్మిర్మి స్తామని హామీ ఇచ్చి వాటికి బడ్జెట్లో నిధులు కేటాయించకపోవడం ఏమిటని ప్రశ్నిం చారు. అంగన్వాడీ కార్యకర్తలు, మున్సిపాలిటీ కార్మికులకు ప్రత్యేక నిధులు కేటాయి స్తామని చెప్పి ఆ పూసే ఎత్తకపోవడం శోచనీయమన్నారు. ఈ బడ్జెట్ ప్రజా సంక్షే మానికి ఏమాత్రం తోడ్పాటునివ్వలేదని, కూటమి ప్రభుత్వంలోనైనా అన్నమయ్య జిల్లా అభివృద్ధి బాటలో పయనిస్తుందన్న జిల్లా వాసుల ఆశలును నీరు గార్చారని అన్నారు. కార్యక్రమంలో సిపిఎం సభ్యులు కొత్త నాని, రమేష్ రెడ్డి, లక్ష్మయ్య పాల్గొన్నారు.

బడ్జెట్‌లో దళితులకు మోసం : కెవిపిఎస్

ప్రజాశక్తి - రాయచోటి

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో జనాభా ప్రాతిపదికన ఎస్‌సిలకు రూ. 35 వేల కోట్లు కేటాయించాల్సి ఉండగా రూ. 20 వేల కోట్లు మాత్రమే కేటాయించి ఇది దళితులను మోసం చేశారని కుల వ్యవస్థ వ్యతిరేక పోరాట సంఘం కెవిపిఎస్ జిల్లా కన్వీనర్ పెంచలయ్య డి .సి. వెంకటయ్య అన్నారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం రద్దు చేసిన సంక్షేమ పథకాలు పునరుద్ధరణ లేదని పేర్కొన్నారు. వీటికి కేటాయింపులు లేకపోవడం దారుణమని పేర్కొన్నారు. బడ్జెట్‌లో సప్పెన్ బి.ఆర్ అంబేద్కర్ స్టడీ సర్కిల్,భూమి కొనుగోలు పథకం, కులాంత వివాహం ప్రోత్సాహం, విదేశీ విద్య వంటి పథకాలు ఊసే లేదని తెలిపారు.దళితులకు ఎన్నికల హామీల్లో భాగంగా అన్ని రకాల వృత్తులకు పింఛన్లు పథకాన్ని ప్రవేశపెట్టి అమలు చేస్తామని హామీ ఇచ్చారని బడ్జెట్‌లో మాత్రం ఈ అంశాలు ప్రస్తావని లేదన్నారు.

సర్వతోముఖాభివృద్ధికి శ్రీకారం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లె సర్వతోముఖాభివృద్ధికి కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టినట్లు ఎమ్మెల్యే షాజహాన్‌బాషా స్పష్టం చేశారు. శనివారం మదనపల్లె నక్కలదిన్నె, గాంధీపురం, సొసైటీ కాలనీ, పిఅండ్‌టి కాలనీ, సిద్దమ్మ లేఅవుట్, ప్రశాంత్ నగర్ తదితర ప్రాంతాలలో రూ.1.66 కోట్ల మున్సిపల్, 15వ ఫైనాన్స్ నిధులతో సిసి రోడ్లు, మురుగునీటి కాలువలకు ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ఐదేళ్ల వైసిపి పాలనలో మదనపల్లె అభివృద్ధి కుంటుపడిందన్నారు. ఏ ఒక్కచోట కానీ కాలువలు, రోడ్లు నిర్మించక పోవడంతో పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారున్నారు. ఎక్కడైనా చిన్నాచిత పనులు చేసినా అవి కేవలం పిఎల్‌ఆర్ కాంట్రాక్టర్‌కు దోచిపెట్టడానికి తప్ప నాణ్యత ప్రమాణాలు పాటించలేదన్నారు. వేసిన కొద్దిరోజుల్లోనే అవి పాడైపోయాయన్నారు. కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో, ప్రజా క్షేమమే ధ్యేయంగా ముందుకు వెళ్తోందన్నారు. కాలువలు, సిసి రోడ్లు పనులను ఆయా ప్రాంతాల్లో ఉన్న కాంట్రాక్టర్లకే తొలి ప్రాధాన్యతనిస్తున్నామన్నారు. దీంతో వారు ఖచ్చితత్వాన్ని పాటించడంతో పాటు నాణ్యత ప్రమాణాలతో, ఏసిన పనులు పది కాలాల పాటు నిలిచిపోయేలా ఉంటాయన్నారు. అదేవిధంగా కాంట్రాక్టర్‌లతో మాట్లాడుతూ ఎక్కడ కానీ నాణ్యత ప్రమాణాలు తగ్గకూడదని సూచించారు. అనంతరం 24వ వార్డు కౌన్సిలర్ తలారి రాధమ్మ మాట్లాడుతూ ఏడేళ్ల కాలంలో 24వ వార్డులో ఒక్క అభివృద్ధి పనిజరగలేదన్నారు. ఎస్‌సి రిజర్వడ్ వార్డు కావడంతో వివక్ష చూపించారన్నారు. ఎన్నిసార్లు అధికారులకు మొరపెట్టుకున్న గాలికి వదిలేసారని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడడం, ఎమ్మెల్యేగా షాజహాన్‌బాషా ఎన్నిక కావడంతోనే మా ప్రాంత అభివృద్ధికి సహకారం అందుతోందన్నారు. ఈ నేపథ్యంలోనే ఇక్కడ రూ.10 లక్షలతో మురుగునీటి కాలువ నిర్మాణానికి ముందుకు రావడం హర్షించదగ్గ విషయం అన్నారు. అదేవిధంగా కుమారపురం, గాంధీపురం తదితర ప్రాంతాల్లో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ మనూజ, కమిషనర్ ప్రమీల, కౌన్సిలర్ రేణుకమ్మ, టిడిపి నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

ప్రజాశక్తి-రాయచోటి

జిల్లాలో ఈనెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని, కార్యక్రమాలను ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి అధికారులను ఆదేశించారు. శనివారం సాయంత్రం రాయచోటి కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో కలెక్టర్ వివిధ శాఖల అధికారులతో అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమాలపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని 8న కార్యక్ర మాలను ఘనంగా నిర్వహించాలని ఐసిడిఎస్, డిఆర్‌డిఎ పీడీలను ఆదేశించారు. జిల్లాలో మహిళలకు ప్రభుత్వం నుంచి డిఆర్‌డిఎ, మెప్మా, ఎస్‌సి కార్పొరేషన్, పరిశ్రమల శాఖ, నైపుణ్య అభివృద్ధి తదితర శాఖల నుంచి ఎన్నో రకాల సంక్షేమ , చేయూ తనిచ్చే పథకాలు అమలు అవుతున్నాయని చెప్పారు. ఐసిడిఎస్ రమాదేవి మాట్లాడుతూ 8 వరకు వారోత్సవాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. బేటి బచావో బేటి పడావో కార్యక్రమం పై ర్యాలీ, ఆడపిల్లలు పుట్టిన సందర్భంగా మొక్కలు నాటడం, బాల్యవివాహాల నిర్మూలనపై ర్యాలీ, మహిళలకు ఉపాధి అవకాశాలపై అవగాహన, ఉన్నత స్థాయికి ఎదిగిన మహిళలకు సన్మానం, తదితర కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్టుగా కలెక్టర్‌కు వివరించారు. సమావేశంల డిఆర్‌డిఎ పీడీ సత్యనారాయణ, బిసి సంక్షేమ శాఖ అధికారి సురేష్, అధికారులు పాల్గొన్నారు.

అమరవీరుల ఆశయాలను కొనసాగిస్తాం

ప్రజాశక్తి - రాయచోటి : రాష్ట్రంలో మాదిగ అమరవీరుల ఆశయాలను కొనసాగిస్తామని ఎంఆర్‌పిఎస్ జాతీయ నాయకులు ఎస్. రామాంజనేయులు పేర్కొన్నారు. శనివారం తహశీల్దార్ కార్యాలయం సమీపంలో అంబేద్కర్ ఫ్లెక్సీ వద్ద మాదిగ అమరవీరుల సంస్మరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా అమరవీరుల చిత్రపటాలకు పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్‌సి వర్గీకరణ ఆయా రాష్ట్రాలు చేసుకొనే అధికారం ఉందంటూ తీర్పునిచ్చిందన్నారు. తెలంగాణలో మూడు విభాగాలుగా విభజించారన్నారు. వర్గీకరణను గతంలో రామచందర్ రాజు కమిషన్ సూచించిన మేరకు జిల్లాలుగా కాకుండా రాష్ట్రాన్ని యూనిట్‌గా తీసుకుని వర్గీకరించాలని ప్రభుత్వాన్ని కోరారు. అమరులైన వారి కుటుంబాలకు రూ.25 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందించి కుటుంబానికి 5 ఎకరాలు చొప్పున భూమి పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంఇఎఫ్ అధ్యక్షులు హరిబాబు, తాతయ్య, పామయ్య, హ్యూమన్ రైట్స్ స్టూడెంట్స్ నాయకుడు సాయికుమార్, నాయకులు, మాజీ సర్పంచ్ బండ పల్లి బసయ్య, వండాడి రమణ పాల్గొన్నారు.

ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, అంగన్‌వాడీ కార్యకర్తలు

బాల్య వివాహాలను అరికట్టాలి

ప్రజాశక్తి-వాల్మీకిపురం: బాల్య వివాహాలను అరికట్టాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ అరుంధతి అన్నారు. శనివారం మండలంలోని చింతపర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బేటీ భచావో-బేటి పడావో కార్యక్రమం సందర్భంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలు, ఆడ పిల్లల హక్కులు, చట్టాలపై అవగాహన కల్పించారు. అనంతరం బేటి భచావో-బేటి పడావో కార్యక్రమం ప్రారంభమై పది సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ర్యాలీ నిర్వహించి, అవగాహన కల్పించారు. ఆర్యక్రమంలో హెచ్‌ఎం రెడ్డెప్ప, ఉపాధ్యాయులు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రామీణ శ్రేయస్సుకు అధిక ప్రాధాన్యత

ప్రజాశక్తి - రాయచోటి : వ్యవసాయం, గ్రామీణ శ్రేయస్సుకు కేంద్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని జిల్లా లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ జి.ఆంజనేయులు తెలిపారు. శనివారం పట్టణంలోని ఎన్‌జిఒ హాలులో జిల్లా లీడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో ప్రధాన మంత్రి నరేంద్రమోడీ పోస్ట్ బడ్జెట్ వేబినార్ వర్చువల్ సమావేశం నిర్వహించారు. ఇందులో కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత పథకాలైన కిసాన్ క్రెడిట్ కార్డు ద్వారా వ్యవసాయ రుణ సదుపాయ కల్పన, నాలుగు శాతం సవరించిన వడ్డీ రాయితీ పథకం ద్వారా వ్యవసాయ రుణాలను రైతులకు అందుబాటులోకి తేవడం, రూ. 2 లక్షల బంధన్ రహిత రుణం, వ్యవసాయ స్వల్పకాలిక రుణం 2029-30 నాటికి రూ.20 లక్షల కోట్ల లక్ష్యం తదితరాలపై ప్రధానమంత్రి వర్చువల్‌గా కార్యక్రమంలో వివరించారు. అనంతరం ఎల్‌డిఎం మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాల ద్వారా రైతులు తక్కువ వడ్డీతో రుణాలు పొందే అవకాశం కలిగి, వ్యవసాయ అనుబంధ రంగాలలో పెట్టుబడులు పెంచుకోవడానికి సహాయపడతా యన్నారు. ఎటువంటి హామీ లేకుండా రూ.2 లక్షల వరకు పంట రుణాలు పొందడం, రాయితీ కలిగిన పంట రుణాల పరిమితిని రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు పెంచారన్నారు.కార్యక్రమంలో కెనరా బ్యాంకు చీఫ్ మేనేజర్ సతీష్ బాబు, అసిస్టెంట్ ఎల్డిఎం వన్నూరుబాష, నాబార్డు, ఆర్‌బిఐ ప్రతినిధులు పాల్గొన్నారు.

నీటి కోసం గొడవపడుతున్న పెద్దూరు కస్పా ప్రజలు

తాగునీటి సమస్యను పరిష్కరించండి

ప్రజాశక్తి-వీరబల్లి

మండలంలోని డి.రాచపల్లి పంచాయతీ పెద్దూరు కస్పాలో తాగు నీటి సమస్య తీర్చాలంటూ మహిళలు రోడ్డుపైన శనివారం డిమాండ్ చేశారు. భూమిలోపల ఉండే నీటి పైపులో వేరులు అడ్డపడి రాకపోవడంతో ప్రజలు ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా ప్రజలు మాట్లాడుతూ నీరు రాక పోవడంతో ఇబ్బందులు పడు తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. భూమి లోపల ఉండే నీటి పైపును మరమ్మతులు చేయించాలని కోరారు. అధి కారులు వెంటనే స్పందించి పెద్దూర్కస్పాలో నీటి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

5న నీలగిరి చెట్లకు వేలం పాట

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

నీలగిరి చెట్లకు ఈనెల 5న బహిరంగ వేలం పాటను నిర్వహిస్తున్నట్లు పంచాయితీ కార్యదర్శి గౌతమి తెలిపారు. శనివారం ఆమె మాట్లాడుతూ తవళం పంచాయితీ పరిధిలోని కోమటివాని చెరువులో ఉన్న నీలగిరి చెట్లకు ఈనెల 5న ఉదయం గం.11 లకు తవళం పంచాయతీ కార్యాలయంలో బహిరంగ వేలంపాట జరుగుతుందని తెఇపారు. ఆసక్తి కలిగి, వేలంపాటలో పాల్గొనదలచిన వారు ధరావత్తు రుసుంగా రెండు లక్షల రూపాయలను కట్టి వేలంపాటలో పాల్గొనాలని అన్నారు. హెచ్చు పాటదారునికి వేలంపాట దక్కుతుందని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, మరింత సమాచారానికి పంచాయతీ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శిని సంప్రదించాలన్నారు.

సంఘం పటిష్టతకు సమిష్టిగా కృషి

ప్రజాశక్తి-పీలేరు

ఆర్యవైశ్య సంఘం పటిష్టతకు సమిష్టిగా కృషి చేద్దామని ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ దుండి రాకేష్ తెలిపారు. శనివారం పీలేరుకు వచ్చిన ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ రాకేష్, డైరెక్టర్ బద్రీనాథ్ లను పీలేరు ఆర్యవైశ్య సంఘం నాయకులు సాధారంగా ఆహ్వానం పలికారు. స్థానిక శ్రీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో వారికి అమ్మవారి దర్శన ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్యవైశ్య సంఘం నాయకులు, సభ్యులు సంఘ పటిష్టతతో పాటు సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ భాగం వహించాలని సూచించారు. ఆర్యవైశ్య సంఘానికి ప్రత్యేక కీర్తి, ప్రతిష్టలు రావడానికి ప్రతి ఒక్కరూ ప్రయత్నం చేయాలని సూచించారు. కార్యక్రమంలో పీలేరు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు వలస వేణుగోపాల్, వైస్ ప్రెసిడెంట్ మల్లికార్జున గుప్త, సెక్రటరీ రేవూరి సుధీర్, కోశాధికారి బాలసుబ్రమణ్యం, నాయకులు జూటూరి అరవింద్, మహేష్, గణేష్, సురేష్, శివ గణేష్ పాల్గొన్నారు.

దేశాభివృద్ధిలో ఆడపిల్లలే కీలకం : హెచ్ఎం

ప్రజాశక్తి-కలికిరి

దేశాభివృద్ధిలో ఆడపిల్లలే పట్టుగొమ్మలని బాలికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు జయమ్మ అన్నారు. శనివారం బేటి బచావో బేటి పడావో కార్యక్రమం ఐసిడిఎస్ ప్రాజెక్ట్ వాల్మీకిపురం వారి పరిధిలో మండలంలో నిర్వహించారు. భేటీ బచావో బేటి పడావో కార్యక్రమం స్థాపించి పది సంవత్సరాలు పూర్తయిందని ఈనెల 1నుంచి 8వ తేదీ వరకు ప్రతిరోజూ ఒక్కొక్క కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. శనివారం బాలికలచేత సైకిల్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అమ్మాజీ, ప్రసన్న, అంగన్వాడీ సెక్టార్ కార్యకర్తలుపాల్గొన్నారు.

లింగ వివక్ష తగదు

తంబళ్లపల్లె: తల్లిదండ్రులు లింగ వివక్షత చూపరాదని అంగన్వాడీ కార్యకర్త ఉమా,కళావతి, సరస్వతి లు కోరారు. శనివారం స్థానిక అంగన్వాడీ కేంద్రంలో ప్లే కార్డులు చేతపట్టి లింగ వివక్షత పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. తల్లిదండ్రులు లింగ నిర్ధారణ పరీక్షలో చేయించరాదని బాలికల చదువుతూనే దేశానికి వెలుగులు వస్తాయని మహిళలను గౌరవించాలని బాల్యవివాహాలు చేస్తే పలు అనర్థాలు జరుగుతాయని అన్నారు. పిల్లలపై జరిగే అత్యాచారాలు, లైంగిక వేధింపులు వంటి వాటిని ప్రతి ఒక్కరూ అరికట్టేందుకు కృషి చేయాలన్నారు. మహిళా చట్టాలపై అవగాహన పెంచుకోవాలని తెలిపారు.

పరీక్ష కేంద్రాల్లో విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

ఇంటర్ పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులు ఎదురుకుంటున్న సమస్యలను పరిష్కరించాలని సిపిఎం జిల్లా కన్వీనర్ పి.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. శనివారం సిపిఎం కార్యాలయంలో విలేకరుల సమావేశం అయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రారంభమయ్యాయని పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని పేర్కొన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద వైద్య సిబ్బంది కనిపించక పోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనం అన్నారు. మదనపల్లి పట్టణంలో జ్ఞానాంబిక జూనియర్ కళాశాల కేంద్రంగా పరీక్షలు జరుగుతున్నాయని, ఈ కేంద్రం హాల్ టికెట్లో ఆర్టిసి బస్టాండ్ వద్ద ఉండగా, పరీక్షలు మాత్రం ప్రశాంత్ నగర్లో ఉన్న నారాయణ జూనియర్ కళాశాల ఉన్న భవనంలో ఏర్పాటు చేశారని, దీంతో విద్యార్థులు చిరునామా కనుక్కోలేక అవస్థలు పడ్డారని అన్నారు. పైగా నారాయణ జూనియర్ కాలేజీ, జ్ఞానంభిక జూనియర్ కాలేజీ లు రెండు పరీక్షా కేంద్రాలు అయితే ఒకే భావనంలో ఉండటం విడ్డూరం అన్నారు. ఇంటర్ బోర్డ్ నిబంధనలకు విరుద్ధంగా రెండు పరీక్ష కేంద్రాలకు ఒకే చోట అనుమతి ఇచ్చిన ఆర్ఐఒ కృష్ణప్ప పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. భారతీ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు కనీసం మౌలిక వసతులు అయినా మరుగుదొడ్లు, మంచినీటి సమస్యలు, పార్కింగ్ సమస్యలతో విద్యార్థులు, తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. 100 మీటర్ల వరకు ఎలాంటి జిరాక్స్ షాపులు ఉండకూడదనే నిబంధనను అధికారులు తుంగలో తొక్కరాని ఆగ్రహం వ్యక్తం చేశారు. భారతి జూనియర్ కాలేజీ కాంప్లెక్స్లో జిరాక్స్ షాపులు, నోటరీ షాపులు యథేచ్ఛగా పరీక్షలు జరుగుతున్న సమయంలో యథావిధిగా పని చేశాయని అన్నారు. అధికారులు మాత్రం చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని అన్నారు. జిల్లా కలెక్టర్, ఇంటర్మీడియట్ బోర్డ్ అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

పశువులకు గాలికుంటు టీకాలు తప్పనిసరి

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

నిమ్మనపల్లి : పశువులకు టీకాలు వేస్తున్న పశువైద్య సిబ్బంది

పశువులలో వచ్చే గాలికుంటు వ్యాధికి టీకాలను తప్పనిసరిగా వేయించి తమ విలువైన పశువులను కాపాడుకోవాలని మండల పశు వైద్యాధికారి డాక్టర్ సురేష్ తెలిపారు. శనివారం వారు మాట్లాడుతూ వేసవికాలంలో పశువులకు వ్యాధులు సోకకుండా పాడి రైతులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అన్నారు. సాధారణంగా పశువులలో వచ్చే గాలి కుంటు వ్యాధి నివారణకు పశు వైద్యుల సూచన లను పాడి రైతులు తప్పక పాటించాలన్నారు. గాలికుంటు వ్యాధి సోకిన పశువులలో నోటి నుంచి సొంగ కారడం, గిట్టల మధ్యలో పుండ్లు, నాలుక పై బొమ్మలు వచ్చి మేత తినక పోవడం, నీరసించి పోవడంతో పాల దిగుబడి తగ్గడం వంటి లక్షణాలు ఉంటాయన్నారు. దీని వలన పశువులు మేత మేయక బక్క చిక్కిపోయి అనారోగ్యం బారి న పడుతాయని తెలిపారు. పాడి రైతులు అపోహలు వీడి ముందు జాగ్రత్తగా పశువులకు టీకాలను వేయించాలన్నారు. ప్రస్తుతం మండల వ్యాప్తంగా 12500 డోసుల టీకాలు అందుబాటులో ఉన్నా యని, మార్చి 30వ తేదీ వరకు 30 రోజులపాటు ప్రతి గ్రామంలోనూ ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించి పశువులకు టీకాలు వేయడం జరుగుతుందన్నారు. టీకాలు వేయడం వలన రెండు రోజులు పాటు పాలు తగ్గడం సర్వ సాధారణ మేనని, తర్వాత యథావిధిగా ఆవు పాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. సకాలంలో పశువులకు టీకాలు వేయించుకోక పోవడం వలన పాల దిగుబడితో పాటు, ఒక్కొక్కసారి పశువులను నష్టపోవాల్సి ఉంటుం దన్నారు. కావున పాడి రైతులు అపోహాలు వీడి పశువులకు గాలి కుంటు వ్యాధి దీకాలను వేయించి విలువైన పశువులను కాపాడు కోవాలని తెలిపారు. కార్యక్రమంలో మల్లికార్జున, హరి పాల్గొన్నారు. **రాజంపేట అర్బన్ :** మండల పరిధిలోని ములక్కాయలపల్లెలో శనివారం 146 పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయడం జరిగిందని ప్రాంతీయ పశు వైద్యశాల డాక్టర్ కె.ప్రతాప్ తెలిపారు. జిల్లా టిడిపి మహిళా అధ్యక్షురాలు అనసూయమ్మ సహకారంతో ఆమె గ్రామంలోనే ఈ కార్యక్రమం చేపట్టడం జరిగిందని ప్రతాప్ అన్నారు. టీకాలు వేయడం ద్వారా గాలికుంటు వ్యాధి రాకుండా నివారించవచ్చునని, ఈ టీకాలతో పాల దిగుబడి తగ్గుతుందన్న అపోహను రైతులు విడనాడాలని సూచిం చారు. ఈ మాసాంతము ఈ కార్యక్రమం కొనసాగుతుందని, పాడి రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జూనియర్ వెటర్నరీ అధికారి ఎం.వరదయ్య, వెటర్నరీ అసిస్టెంట్ సుదర్శన్రెడ్డి, సిబ్బంది వరలక్ష్మి పాల్గొ న్నారు. **చిన్నమండెం :** మండల కేంద్రంలోని బలిజపల్లిలో పశువులకు జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకం కింద పశువులకు గాలికుంటువ్యాధి, బ్రుసెల్లా వ్యాధినిరోధక టీకాలను పశు వైద్యాధికారి డాక్టర్ జి.గణేష్ ఆధ్వర్యంలో వేశారు. మండల పరిధిలోని ప్రజలు, పాడి రైతులందరూ కూడా మార్చి 30 తేదీ వరకు ఆయా గ్రామాల్లోని పశుసేవ కేంద్రాలలో వ్యాధి నిరోధకటికాలు వేస్తారని, ఈ అవకాశాన్ని పాడి రైతులు అందరూ వినియోగించుకోవాలని కోరారు.

పోలీసుల విధులపై విద్యార్థులకు అవగాహన

నిమ్మనపల్లి : విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు పోలీసు విధుల పట్ల అవగాహన కలిగి ఉండాలని ఎస్ఐ తిప్పేస్వామి అన్నారు. మార్చి 8న మహిళా దినోత్సవం పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం మార్చి 1వ తేదీ నుంచి వారం రోజులపాటు రోజుకు ఒక కార్యక్రమాన్ని నిర్వ హిస్తూ మహిళల అభ్యున్నతని చాటాలని ఆదేశించింది.శనివారం ఎస్ఐ తిప్పేస్వామి స్థానిక పోలీసు స్టేషన్లో పాఠశాల విద్యార్థినిలతో ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బాల్యవివాహాలపై, గుడ్టచ్, బ్యాడ్ టచ్పై, ఫోక్సో చట్టం, మహిళల భద్రత, రోడ్డు భద్రత, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. సమాజంలో పోలీసు విధుల పట్ల అవగాహన కలిగి ఉండాలని వారికి సూచించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. **సుండుపల్లి :** రాయచోటి రూరల్ సిఐ వరప్రసాద్ సూచనల మేరకు స్థానిక పోలీసు స్టేషన్లో ఓపెన్హౌస్ నిర్వహించారు. పోలీసుల విధులపై విద్యార్థులకు క్షుణంగా వివరించారు. బాల్యవివాహలు, మహిళ చట్టాలపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. సైబర్ నేరాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు.

అమరవీరుల త్యాగాలు మరువలేనివి : ఎంఆర్పిఎస్

ప్రజాశక్తి-పీలేరు

పీలేరు : అమరవీరుల చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న ఎంఆర్పిఎస్, ఎంఎస్పి నాయకులు

అమరవీరుల త్యాగాలు ఎప్పటికీ మరువలేనివని ఎంఆర్పిఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి దుడ్డు రామకృష్ణ మాదిగ తెలిపారు. మంద కృష్ణ మాదిగ పిలుపుమేరకు మాదిగ అమరవీరుల దినోత్సవం నిర్వహించారు. శనివారం ఎంఆర్పిఎస్ సీనియర్ నాయకులు, ఎంఎస్పి పీలేరు నియోజకవర్గ ఇన్ఛార్జి గండికోట వెంకటేష్ ఆధ్వర్యంలో పీలేరు మార్కెట్ యార్డ్ వద్ద జ్యోతిరావుపూలే విగ్రహం ఎదుట అమరవీరుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రామకృష్ణ అమరవీరుల చిత్ర పటాలకు పూలమాలు వేసి అమరవీరులకు జోహార్, అమరవీరుల ఆశయ సాధనకు కృషి చేద్దాం అంటూ నివాళు లర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎస్సి షెడ్యూల్ కులాల వర్గీకరణ లక్ష్యసాధనలో భాగంగా పద్మశ్రీ అవార్డు గ్రహీత ఎంఆర్పిఎస్ జాతీయ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ నేతృతంలో ఎన్నో అలుపెరుగని ఉద్యమాలు చేసి, అసువులు బాసిన అమరవీరుల త్యాగాలు మరువలేనివని అన్నారు. కార్యక్రమంలో ఎంఆర్పి ఎస్ సీనియర్ నాయకులు పీలేరు నియోజకవర్గ ఇన్ఛార్జి గండికోట వెంకటేష్, కో-ఇన్ఛార్జి అమరాల వెంకటరమణ, సీనియర్ నాయకులు ఈపూరి వెంకటరమణ, దండు రమణ, గంటపార నాగరాజు, జి ఎన్ రమణ, కప్పరం చంద్రయ్య, నియోజకవర్గ యువసేన నాయకులు రెడ్డి కుమార్, రాజేష్, నరసింహ, పీలేరు మండలం ఇంచార్జ్ చరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. **బి.కొత్తకోట :** మాదిగ అమరవీరుల త్యాగాల ఫలితంగానే సుప్రీం కోర్టు ద్వారా విజయం సాధించిందని ఎంఎస్పి జాతీయ నాయకులు ఎస్.నరేంద్రబాబు మాదిగ తెలిపారు.మాదిగ అమరవీరుల సంస్మరణ దినాన్ని స్థానిక కొండా ఎస్టేట్లో ఎంఎస్సి, ఎంఆర్పిఎస్ మండల కమిటీల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎంఆర్పిఎస్ అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి,కొవ్వొత్తులు వెలిగించి,మౌనం పాటించి నివాళులర్పించారు.మాదిగ అమరవీరుల ప్రాణ త్యాగాల పునాధుల మీదనే ఎస్సి వర్గీకరణ ఉద్యమం విజయం సాధించిందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి ఈశ్వర్, ఎంఎస్పి సీనియర్ నాయకులు భవాని వెంకటేష్, ఎంఎస్పి మండల ఇన్ఛార్జి చౌడప్ప, ఎంఆర్పిఎస్ మండల అధ్యక్షులు పలక రఘు పాల్గొన్నారు.

గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన :'చమర్తి'

ప్రజాశక్తి-సుండుపల్లి

ప్రతి గ్రామంలో మౌలిక వసతులకు కృషి చేస్తామని, ప్రతి పల్లెను అభివృద్ధి పథంలో నడిపించేందుకు కూటమి చిత్తశుద్ధితో పనిచేస్తోందని రాజంపేట పార్లమెంటు టిడిపి అధ్యక్షులు చమర్తి జగన్మోహన్రాజు పేర్కొన్నారు. శనివారం సుండుపల్లి మండలం ఆరమ్మ తల్లి దేవస్థానంలో సిసి రోడ్ల నిర్మాణానికి భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో రోడ్లు, డ్రెయినేజీ, వీధిదీపాలు, తాగునీరు వంటి మౌలిక వసతులు కల్పిస్తున్నామని అన్నారు. గత వైసిపి పాలనలో హంగూ ఆర్భాటమే తప్ప గ్రామాలను ఏ మాత్రం అభివృద్ధి చేయలేదని అన్నారు. చంద్రబాబు ఆలోచనలు, ఆశయాలకు అనుగుణంగా రాజంపేట నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్ళుగా పని చేస్తు న్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు కళ్ళె రెడ్డప్ప, కిరణ్నాయుడు, సురేష్నాయుడు. సూరి నాయుడు, జనసేన మండల అధ్యక్షుడు రాజా, వీర మహిళ రెడ్డిరాణి, బాబు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాజగోపాల్రెడ్డి మృతి బాధాకరం

ప్రజాశక్తి-రామాపురం

మండలంలోని నల్లగుట్టపల్లి పంచాయతీ కర్ణపు వాండ్లపల్లికు చెందిన టిడిపి సీనియర్ నాయకుడు రాజగోపాల్ రెడ్డి మృతి బాధాకరమని నియోజవర్గ టిడిపి నాయకులు మండిపల్లె లక్ష్మి ప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. రాజగోపాల్ రెడ్డి అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల తిరుపతి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న లక్ష్మీ ప్రసాద్రెడ్డి శనివారం కర్ణపు వాండ్లపల్లికు ఆయన భౌతిక యానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆయన కుటుంబానికి అండగా ఉంటామని అధైర్య పడవద్దని భరోసానిచ్చారు. టిడిపి ఒక మంచి నాయకుడిని కోల్పోయిందని అనాఉ. రాజగోపాల్ రెడ్డి గతంలో సరస్వతి పల్లె సింగల్ విండో అధ్యక్షునిగా మండలంలోని రైతులకు సేవ చేసి వారి మన్ననలు పొందారని అన్నారు. ఆయన వెంట లక్కిరెడ్డిపల్లి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఎం.రమేష్రెడ్డి , చంద్రమౌళి, భవనం వెంకటరామిరెడ్డి, మండల టిడిపి అధ్యక్షుడు రవికుమార్రెడ్డి, చెన్న కృష్ణారెడ్డి , వెంకటరామిరెడ్డి పాల్గొని సంతాపం తెలిపారు.

రెవెన్యూ సిబ్బందితో మాట్లాడుతున్న సబ్కలెక్టర్ మేఘస్వరూప్

60 శాతం అర్జీలకు పరిష్కారం

- మదనపల్లె సబ్ కలెక్టర్ మేఘస్వరూప్

ప్రజాశక్తి-బి.కొత్తకోట

మండలానికి సంబంధించి రెవెన్యూ సదస్సులో వచ్చిన 1023 అర్జీలలో 60 శాతం పరిష్కరించినట్లు సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ తెలిపారు.శనివారం ఆయన మండలంలో విస్తృతంగా పర్యటించారు.ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ గతంతో పోల్చుకుంటే రెవెన్యూ సదస్సులో వచ్చిన అర్జీలు పరిష్కరించడంలో తహశీల్దార్ మహమ్మద్ అజారుద్దీన్ మెరుగ్గా పూర్తి చేశారని ఇంకా 40 శాతంలో బి.కొత్తకోట రెవెన్యూ పరిధిలో 210, బడికాయల పల్లి 75, గట్టు సంబంధించి 62,మొత్తంగా 40 శాతం పరిష్కరించాల్సి ఉందని తెలిపారు. జిఒ నెంబర్ 31 ప్రకారం ఎవరైతే ఇల్లు లేకుండా గుడిసెలు వేసుకొని ఉంటారు వారికి అర్హత కలిగిన ఉంటే ఒకటిన్నర సెంటు కేటాయించాలని ప్రభుత్వం జిఒ నెంబర్ 31విడుదల చేసిందని తెలిపారు. ఈ కాల పరిమితి ఈ సంవత్సరం ఆఖరి వరకు వర్తిస్తుందని అన్నారు. ఎటువంటి ఆసరా లేనివారికి ఇదొక గొప్ప వరమని అన్నారు. మదనపల్లి డివిజన్ పరిధిలో 18 వేల వరకు ఇంటి స్థలాలకు అర్జీలు వచ్చాయని, అందులో నాన్ఎలిజిబుల్ వారిని గుర్తించే పనిలో విఆర్ఒలు నిమగ్నమై ఉన్నారని, ఎలిజబుల్ అయిన వారికి కచ్చితంగా ఇంటి పట్టాలు మంజూరు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో తహసిల్దార్ మొహమ్మద్ అజారుద్దీన్, ఆర్ఐ వీరాంజనేయులు, సర్వేయర్, విఆర్ఒలు పాల్గొన్నారు.

వైజ్ఞానిక ప్రదర్శనలో ప్రతిభ చాటిన విద్యార్థులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

వైజ్ఞానిక ప్రదర్శనలో విద్యార్థుల ప్రతిభ, వినూత్న ఆలోచనలు కనబరచడంపై సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎన్.మునిగోపాలకృష్ణ ప్రశంసించారు. శనివారం స్థానిక జిఆర్టి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ నందు విద్యార్థులు సైన్స్ ఫెయిరులో ప్రదర్శించిన నమూనాలను పరిశీలించి వాటి ఆవశ్యకత గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల్లో దాగివున్న సృజనాత్మకతను చాటి చెప్పేలా ఏర్పాటు చేసిన నమూనాలను హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు తేజశ్రీ, కో-ఆర్డినేటర్ జగన్మోహన్, ఆంధ్ర పెన్షనర్స్ పార్టీ నాయకులు గురు నారాయణాచారి, కృష్ణమూర్తిల తో కలిసి పరిశీలించారు.ఇందులో ఫ్యాక్టరీల నుంచి వెలువడే వాయు కాలుష్యం నమూనా ఏర్పాటు చేసిన వై.ఇందుమతి, బి.చైత్ర, అక్షయలు మొదటి స్థానంలోను, ఎస్.మోక్షిత ప్రియ, పి.లిహస్, కౌశల్ లకు ద్వితీయ స్థానం, అప్సాన, బృందావని, గీతామాధురి, పూజిత లను తృతీయ స్థానానికి ఎంపిక చేసి బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఎన్.మునిగోపాలకృష్ణ మాట్లాడుతూ వైజ్ఞానిక ప్రదర్శన విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను చాటి చెప్పడానికి దోహదపడుతుందన్నారు. విద్యార్థుల్లో దాగివున్న నైపుణ్యాలను వెలికి తీసి భావితరాలకు చాటి చెప్ప డానికి ఇలాంటి ప్రదర్శనలను మరింత ముందుకు తీసుకు వెళ్లాలని ఆకాంక్షిం చారు.హెచ్. ఎం.తేజశ్రీ మాట్లాడుతూ విద్యార్థుల నైపుణ్యాలను గుర్తించే వేదికగా వైజ్ఞానిక ప్రదర్శన ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సర్వే నెంబర్ 239లోని భూమిని స్వాధీనం చేసుకోండి

పట్టణంలోని 239 సర్వేనెంబర్ గల డికెటి భూమిని స్వాధీనం చేసుకోవాలని తహశీల్దార్ మహమ్మద్ అజారుద్దీన్ ను సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ ఆదేశించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పిఒపి రికార్డులో ఉన్న భూమిని తిరిగి వాళ్ళు క్రయ విక్రయాలు, డికెటి భూమిని క్రయవిక్రయాలు చేయడం కూడా నిబంధనల ప్రకారం నేరమన్నారు.ఈ సర్వే నంబర్ భూమిలో హక్కు ఉందని వచ్చే వారిపై కేసులు నమోదు చేయాలని సూచించారు.సబ్ కలె సర్వేనెంబర్ 239లో భూమిని సరెండర్ చేసుకోమని సూచించారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

కూటమి పాలనలో అమలుకాని హామీలు

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

మాట్లాడుతున్న శివారెడ్డి

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నప్పుటి నుండి ముఖ్య మంత్రి చంద్రబాబు,ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలకు చెవిలో పూలు పెట్టారని వైసిపి జిల్లా యూత్ ప్రెసిడెంట్ వెలకచర్ల శివారెడ్డి అన్నారు. శనివారం వైసిపి కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. బాబు వస్తే జాబ్ వస్తుందని, నారా లోకేష్ జాబ్ కేలండర్ ఏర్పాటు చేస్తామని చెప్పి మోసం చేశారని అన్నారు. అధికారంలోకి వచ్చాకా మొదటి సంతకం డిఎస్సిపై చేసి నిరుద్యోగులకు కుచ్చుటోపి పెట్టారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9నెలలు గడుస్తున్నా ఎటువంటి హామీలు నెరవేర్చలేదని అన్నారు. రాష్ట్ర ప్రజలు కూటమి ప్రభుత్వంపై అసంతృప్తితో రగులుతున్నారని అన్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఉద్యోగాలు ఇవ్వకుంటే కాలర్ పట్టుకుని అడగమని చెప్పారని ఇప్పుడు ఎవరి కాలర్ పట్టుకోవాలో అర్థం కాని స్థితిలో నిరుద్యోగులు ఉన్నారని అన్నారు. కార్యక్రమంలో యూత్ నాయకులు సుబ్రహ్మణ్యంరెడ్డి, రెడ్డయ్య, కోటేశ్వర్రెడ్డి పాల్గొన్నారు.

క్రైం కార్నర్

నలుగురు పేకాటరాయుళ్లు అరెస్టు

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

పేకాట స్థావరం పై దాడులు నిర్వహించి నలుగురిని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు స్థానిక ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. పోలీసుల వివరాల మేరకు..తవళం పంచాయతీ కుమ్మరపల్లెకు సమీపంలోని చింత చెట్టు కింద కుమ్మరపల్లెకు చెందిన నలుగురు వ్యక్తులు కలిసి పేకాట ఆడుతుండగా పోలీసులు దాడులు నిర్వహించారు. జూదం ఆడుతున్న నలుగురిని అదుపు లోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.3830లు స్వాధీనం చేసుకొని, వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బంగారు గొలుసు చోరీ : కేసు నమోదు

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

మహిళ మెడలో బంగారు గొలుసు చోరీ జరిగిన సంఘటనపై శనివారం స్థానిక ఎస్ఐ తిప్పేస్వామి కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు..ముష్టూరు పంచాయతీ వలసపల్లెకు చెందిన లచ్చక్కగారి ఓబులమ్మ బెంగళూరులో ఉన్న తన చిన్న కుమారుడు వాసుదేవరెడ్డి వద్ద ఉంటుం దని అన్నారు. పింఛను తీసుకోవడానికి గత నెల27న బెంగళూరు నుంచి మదనపల్లెకు వచ్చి మండలంలోని పట్టావారిపల్లె బస్స్టాప్ వద్ద 12.30 లకు బస్సు దిగి ఇంటికి వెళ్లడానికి తన మనవడి రాక కోసం ఎదురు చూస్తుం దని అన్నారు. అదే సమయంలో ముష్టూరు వైపు నుంచి ఇద్దరు వ్యక్తులు ద్విచక్ర వాహనంలో మహిళ వద్దకు వేగంగా వచ్చి మహిళ మెడలోని బంగారు గొలు సును లాక్కోవడానికి ప్రయత్నించగా, ఆమె కింద పడిపోవడంతో వెనక కూర్చున్న వ్యక్తి బలవంతంగా మహిళ మెడలోని బంగారు గొలుసును లాక్కొని వేగంగా అక్కడి నుంచి వెళ్లిపోయారని అన్నారు. బంగారు గొలుసు సుమారు 20 గ్రామా లకు పైన ఉంటుందని దాని విలువ రూ.1.50 లక్షలు ఉంటుందని తెలిపారు. బాధిత మహిళ చిన్న కుమారుడు వాసుదేవ రెడ్డి బంగారు గొలుసు దొంగలించిన దుండగులను గుర్తించి తమకు న్యాయం చేయాలని పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఘనంగా గంగమ్మ బోనాలు

ప్రజాశక్తి-వీరబల్లి

మండలకేంద్రంలోని వంగిమళ్ళ గ్రామంలోని పోలు చెన్నా రెడ్డిగారిపల్లెలో శనివారం కుంకుమబండి వద్ద గంగమ్మ బోనాల కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించినట్లు విఆర్డిఎస్ సురేంద్రారెడ్డి తెలిపారు. గ్రామంలోని మహిళలు ఇంటికో బోనం నెత్తిన ఎత్తుకొని డప్పులు, బాణాసంచా కాలుస్తూ ఊరేగింపుగా బండి వద్దకు చేరుకున్నారు. అక్కడ మహిళలు కుంకుమ బండిని పూలతో ప్రత్యేకంగా అలంకరించి బోనాలు సమర్పించి ప్రజలు సుఖ సంతోషాలతో ఉండి పంటలు బాగ పండాలని ఆకాంక్షిం చారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

మదనపల్లె పురపాలక సంఘము

ఈ-ప్రొక్యూర్మెంటు టెండరు నోటీసు

ఆర్.ఓ.సి. నెం.2962/E1/2008 తేది: 01.03.2025

మదనపల్లె పురపాలక సంఘము నందు క్రింద తెలిపిన పనులకు గాను ఈ-ప్రొక్యూర్మెంటు ద్వారా టెండర్లు ఆహ్వానించడమైనది.

వ. నెం	నిధులు	టెండర్ ఐ.డి.లు	పని అంచనాల మొత్తము
1	పురపాలక సాధారణ నిధులు	787580	రూ. 5.00 లక్షలు
2		787763	రూ. 5.00 లక్షలు
3		787770	రూ.4.5/0 లక్షలు

పై పనులకు సంబంధించిన పూర్తి వివరముల కొరకు వారి e Procurment market place నందు చూడవలెను మరియు ఆఫీసు పనివేళలలందు సంబంధిత అధికారులను సంప్రదించగలరు.

వరుస నెం. 1
బిడ్ డాక్యుమెంటు డౌన్లోడ్ చేసుకొనుటకు మొదలు తేది : 28.02.2025 : 11.00 AM
బిడ్ డాక్యుమెంటు డౌన్ లోడ్ చేసుకొనుటకు చివర తేది : 17.03.2025 : 11.00 AM
బిడ్ డాక్యుమెంటు స్వీకరించుటకు చివర తేది : 17.03.2025 : 11.15 AM

వరుస నెం. 2
బిడ్ డాక్యుమెంటు డౌన్లోడ్ చేసుకొనుటకు మొదలు తేది : 02.03.2025 : 11.00 AM
బిడ్ డాక్యుమెంటు డౌన్ లోడ్ చేసుకొనుటకు చివర తేది : 17.03.2025 : 11.00 AM
బిడ్ డాక్యుమెంటు స్వీకరించుటకు చివర తేది : 17.03.2025 : 11.15 AM

వరుస నెం. 3
బిడ్ డాక్యుమెంటు డౌన్లోడ్ చేసుకొనుటకు మొదలు తేది : 02.03.2025 : 11.00 AM
బిడ్ డాక్యుమెంటు డౌన్ లోడ్ చేసుకొనుటకు చివర తేది : 17.03.2025 : 11.00 AM
బిడ్ డాక్యుమెంటు స్వీకరించుటకు చివర తేది : 17.03.2025 : 11.15 AM

షరతులు : ఏ కారణము తెలుపకుండా టెండరును పాక్షికముగా కాని, పూర్తిగా కాని రద్దపరచుటకు/ నిరాకరించుటకు కమీషనరు వారికి పూర్తి అధికారములు కలవు.

కమీషనరు
మదనపల్లె పురపాలక సంఘము.

IN THE COURT OF THE HON'BLE JUNIOR CIVIL JUDGE : LAKKIREDDIPALLI

I.A.No. 421 /2024
O.S.No. 47 /2024

1. Bale Ramanjaneyulu, S/o Venkatramana (D1), Gollapalli, H/o Dappepalli, Lakkireddypalli (M), Kadapa (D).
2. Yarragorla Venkateswaramma, W/o Chinna Reddappa and D/o Bale Venkataramana, Balevari palli H/oPeddamandem (M), Chittor (D).
3. Vemula Obulamma, W/o Sivasankara,and Bale Venkataramana, Saraswa thi Nagar Galiveedu roa d, Rayachoty town and Mandal. Kadapa district.

...Petitioners/Plaintiffs

Vs

R2. Bale surendraprasad S/o Bale Venkatramana, Gollapalli, H/o Dappepalli (v), LR Palli (m), Kadapa (D), Now residing at by the side of Door No. 53/189-30, Saraswathi Nagar, Galiveedu Road, Rayachoty Town, Annamayya District..

...Respondents/Defendants

NOTICE TO RESPONDENT NO.2.

Please take notice that the above petition filed against you for passing.final decree of the Petition property. The said petition I.A.No. 421/2024 is posted for your appearance on 26-03-2025 at 10-30 AM. On that day you should appear before the Hon'ble court and file your objections if any, if you did not appear on that day, the above petition will decide in your absence as set exparte.

V.BALAJI REDDY, B.A., B.L.
Advocate for Plaintiff.
Lakkireddipalli
Cell No. 9849389451.

మహారాజశ్రీ ఆళ్ళగడ్డ సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో
O.S. No. 22/2023

తాలెపల్లి సుజాత .... Plaintiff

V/s.

K. సుబ్రమణ్యం, ... Defendant No. 3
S/o. Late K. ఆంజనేయులు,
హిందూ, వయస్సు 56 సం॥లు,
బ్యాంక్ ఉద్యోగి, ING Vysya Bank,
మదనపల్లె బ్రాంచ్, మదనపల్లె టౌన్, మండలం,
అన్నమయ్య జిల్లా, ఆంధ్రప్రదేశ్.

Defendant No.3 దావా సమను నోటీసు కొరకు

పై దావా నెంబరులో పై కోర్టులో దావా దాఖలు చేసి పలుమార్లు నీకు సమన్లు పంపినప్పటికి, నీకు ముట్టనందున పై దావాలో నీకు ఏమైన ఆక్షేపణలు ఉన్న యెడల నీవు స్వయంగా గాని, న్యాయవాది ద్వారా గాని, 10-03-2025వ తేదీన ఉదయం 10-30 గంటలకు పై కోర్టులో హాజరై నీ ఆక్షేపణలు తెలుపుకొనవచ్చును. లేని యెడల పై దావాను విచారించి మీ పరోక్షమున తీర్మానించబడునని తెలియజేయడమైనది.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
వాయిదా : 10-03-2025

యస్. చంద్రశేఖర్ రెడ్డి
సి.జి. ఓబులేసు,
అడ్వకేట్స్, కోవెలకుంట్ల,
సెల్ : 9885224734